క్లుప్తంగా

18న వేంకటేశ్వర స్వామి కల్యాణం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ద్వారకాతిరుమల ఆలయ సూపరింటెండెంట్, గోశాల సభ్యులు

ఉంగుటూరు: ఈ నెల 18న నాచుగుంట గోశాలలో వేంకటేశ్వరస్వామి కల్యాణం చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు కల్యాణం నిర్వహించే గోశాల ప్రదేశాన్ని ద్వారకాతిరుమల ఆలయం సూపరింటెండెంట్ హయగ్రీవ, గోశాల కమిటీ సభ్యులు పరిమి రాఘవులు, కొరిపల్లి వెంకట అప్పారావు తదితరులు బుధవారం పరిశీలించారు. 18వ తేదీ ఉదయం 9.30 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. దీనికి ముందు నాచుగుంట గ్రామ ప్రవేశం వద్ద నుంచి స్వామి వారి రథానికి స్వాగతం పులుకుతూ మేళతాళాలు, కోలాట భజనల నడుమ భక్తులు స్వాగతం పలుకుతూ ఊరేగింపు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: పోతునూరు పాఠశాలలో బుధవారం విద్యార్థులకు రక్తహీనత, బరువు, ఎత్తు పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి వారి వ్యక్తిగత కార్డులో నమోదు చేశారు. విద్యార్థుల కు ఆహారపు అలవాట్లు, వ్యాయామం, నిద్ర సెల్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఓ ప్రభాకర్‌రావు, సూపర్‌వైజర్ హరి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'చుండూరు' బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న జాతీయ ప్రధాన కార్యదర్శి

భీమడోలు: చుండూరు మారణకాండలో బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. భీమడోలులోని వీసీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చుండూరు ఎస్సీ మృతవీరుల సంస్మరణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎస్ఏడీ పాల్, చాగంటి సంజీవ్, అలుగు ఆనంద్ శేఖర్, డీకేవీ ప్రకాష్, చీర భరత్, అంబటి నాగేంద్రప్రసాద్, ముళ్లగిరి జాన్సన్, పల్లెం ప్రసాద్, బోసురావు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

భీమడోలు: 104 ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ గంగాభవాని అన్నారు. భీమడోలు సచివాలయం నంబర్–1 వద్ద గల హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో బుధవారం నిర్వహిస్తున్న 104 ఆరోగ్య శిబిరాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులను గుండుగొలను వైద్యాధికారిణి డాక్టర్ శరణ్యతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ అధికారి మధుసూదనరావు, ఎంఎల్‌హెచ్‌పీ నాగదుర్గ, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, సిబ్బంది రజిత, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

భూసారంపై దృష్టి సారించాలి

దెందులూరు: రైతులు అధిక దిగుబడులు సాధించాలన్న ప్రయత్నంలో భూసారం తగ్గకుండా చూసుకోవలసిన బాధ్యత రైతులపైనే ఉందని మండల వ్యవసాయ అధికారి ఎల్.శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం దెందులూరు మండలం శ్రీరామవరం, ముప్పవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

ఉంగుటూరు: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చేబ్రోలు సుప్రీం ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లా అధికారులకు ఘన వ్యర్థాల నిర్వహణపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే చేబ్రోలు పీహెచ్‌సీలో నిర్వహించిన సదరం క్యాంపును ధర్మరాజు ప్రారంభించి, రోగులతో మాట్లాడారు. అనంతరం చేబ్రోలులో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో ఆయన పాల్గొని ర్యాలీ నిర్వహించారు. మండలంలోని కంసాలిగుంట, రామచంద్రపురం, పందిరెడ్డిగూడెం, గొల్లగూడెం, నల్లమాడు, చేబ్రోలు గ్రామాల్లో పల్లెపల్లెకు ధర్మరాజు కార్యక్రమం నిర్వహించారు.

అధిక దిగుబడికి కాలిబాటలు

- గాలి, వెలుతురు తగిలి ఏపుగా పెరగనున్న పైరు
- కాలిబాటలు తప్పనిసరని సూచిస్తున్న వ్యవసాయాధికారులు



వరిచేనులో ఏర్పాటు చేసిన కాలి బాటలు



నాట్లు వేసిన పొలంలో కాలిబాటలు వేస్తున్న రైతు

గణపవరం: రబీ వరినాట్లు చివరి అంకానికి చేరాయి. రైతులు వరినాట్లు పూర్తి చేసి, పొలాల్లో కాలిబాటలు వేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా వరినాట్లు వేసే సమయంలో రైతులు పొలంలో కాలిబాటల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పొలంలో కాలిబాటలు నిర్మించడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరిస్తున్నారు. అయితే చాలా మంది రైతులు కాలిబాటలు వేయడంపై అంతగా ఆసక్తి చూపరు. దీనికి కారణం కాలిబాటల ఏర్పాటుకు అదనంగా ఖర్చులు, కాలిబాట మార్గంలో వరినాట్లు తొలగించడం వలన దిగుబడి తగ్గుతుందన్న అపోహతో కాలి బాటల ఏర్పాటుకు దూరంగా ఉంటున్నారు. అయితే నాట్లు వేసిన పొలంలో ప్రతి రెండు మీటర్ల దూరంలో కాలిబాటలను వేయడం వలన మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు. వ్యవసాయ సిబ్బంది సూచనలతో రైతులు ఇటీవల కాలిబాటలు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. చాలా మంది రైతులు నాట్లు వేసే సమయంలోనే లైన్ తాడును ఉపయోగించి కాలిబాటలను ఏర్పాటు చేస్తున్నారు. మరి కొందరు రైతులు నాట్లు వేసిన వారం పది రోజుల్లో వరి నాట్లు వేళ్లూనుకునే సమయంలో కాలిబాటలు వేసుకుంటున్నారు.

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. తూర్పు, పడమర దిశగా ప్రతి రెండు మీటర్లకు ఒక కాలి బాట ఏర్పాటు చేసుకోవాలి. ప్లాస్టిక్ లేదా కొబ్బరి డొక్క తాడు తీసుకొని చేను గట్టుకు ఒకవైపు గట్టు నుంచి మరో వైపు గట్టుకు తాడును బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీ మీటర్ల వెడల్పుతో వరి నాట్లు తొలగించాలి. ఈ నాట్లు పొలంలో పల్చగా ఉన్న వేరే ప్రాంతాల్లో నాటుకోవచ్చు. వెదజల్లే పద్ధతిలో సాగు చేసే వారు విత్తనాలు చల్లిన 15 రోజుల నుంచి 20 రోజుల వ్యవధిలో వరి మొక్కలను తొలగించి కాలిబాటలు వేసుకోవాలి.

కాలి బాటల వలన ప్రయోజనాలు

కాలిబాటలు వేయడం వలన వరి దుబ్బుల మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగలడం వలన పైరు ఆరోగ్యవంతంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంత వరకూ తగ్గుతుంది. కాలి బాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, తెగుళ్లు, చీడ పీడలు ఆశిస్తే సులభంగా గుర్తించడానికి, ఎలుకల నివారణకు, ఎరువులు, పురుగు మందులు చల్లుకోవడానికి అనువుగా ఉంటుంది. తుఫాన్లు, భారీ వర్షాల పకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా కాలిబాటలు ఉపయోగపడతాయి. వరి మడిలో భూమి తడి లేకుండా ఆరబెట్టే వీలు కలుగుతుంది. వరికోత సమయంలో సులభంగా కోత కోసుకునేందుకు అనువుగా ఉంటుంది.

కాలిబాటలు వేస్తే ప్రయోజనమే



రైతులు పొలంలో కాలిబాటలు తప్పనిసరిగా వేసుకోవాలి. దీని వల్ల రైతులకు లాభమేతప్ప ఎలాంటి నష్టం ఉండదు. ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి ఇద్దరు కూలీలకు రూ.800 నుంచి రూ.1000 వరకూ ఖర్చు అవుతుంది. అయితే వీటివల్ల మూడు నుంచి నాలుగు బస్తాల అదనపు దిగుబడి వస్తుంది. కలుపు మొక్కల తొలగింపు, చీడపీడలను సకాలంలో గుర్తించడం, సస్యరక్షణ చర్యలు తీసుకోవడం, ఎలుకలవల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం వంటి ఉపయోగాలున్నాయి. వ్యవసాయ సిబ్బంది ప్రతీ రైతు పొలంలో కాలిబాటలు వేసేలా ప్రోత్సహిస్తున్నారు.

– ఆర్ఎస్ ప్రసాద్, ఏవో, గణపవరం

కాలిబాటలు వేసుకుంటున్నాం



నేను చాలా కాలంగా పొలంలో కాలిబాటలు వేసుకుంటున్నాను. దీని వలన రైతులకు ఎంతో ఉపయోగం ఉంది. గతంలో కాలిబాటల వలన దిగుబడి తగ్గుతుందని అపోహ పడే వాళ్లం. వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించడంతో ఐదారేళ్లుగా క్రమం తప్పకుండా కాలిబాటలు వేస్తున్నాను. దీనివలన పొలంఅంతా కలియ తిరిగి చూసుకునే అవకాశం ఉంది. ఎరువులు, మందులు చల్లడం కూడా సులభంగా ఉంది.

– నంకు పెదకాపు, రైతు

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై హత్యాయత్నం దారుణం



సూర్యనారాయణ

దెందులూరు: ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్‌పై బుధవారం పులివెందుల జెడ్పీటీసీ బయ్యు లక్ష్యం సందర్భంగా దాడి దౌర్జన్యం చేయడం దారుణమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదుగురు సూర్యనారాయణ హెచ్చరించారు. ఈ ఘటన టీడీపీ పతనానికి నాంది అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పార్టీ అన్ని విభాగాల శ్రేణులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యాకాండ, వేధింపులు, అక్రమ కేసులు, అక్రమ నిర్బంధం విపరీతంగా పెరిగిపోయాయన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేక ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి ఆగ్రహాలను పక్కదారి పట్టించడానికి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన నియోజకవర్గంలో జెడ్పీటీసీ ఉప ఎన్నిక టీడీపీ ఎలా గెలుస్తుందని ఊహిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలు కూటమి ప్రభుత్వ దాడులు, దౌర్జన్యాలను గమనిస్తున్నారని ఎమ్మెల్సీపై జరిగిన దాడిలో నిందితులను తక్షణమే అరెస్టు చేయకపోతే రాష్ట్ర బీసీ సంఘం భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటిస్తామని సూర్యనారాయణ హెచ్చరించారు.

జెస్సీ రాజ్‌కు సత్కారం

దెందులూరు: ఏషియన్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్– 2025 సిల్వర్ మెడల్ విన్నర్ ప్రధానమంత్రి బాల పురస్కార అవార్డు గ్రహీత మాత్రపు జెస్సీరాజ్‌ను బుధవారం అమరావతిలో రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి అభినందించి సత్కరించారు. ఇండియా కోచ్ ఆదేశ్ సింగ్ స్థానిక కోచ్ సింహాద్రి ప్రణాళిక శిక్షణ వెలకట్ట లేనిదన్నారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి



మోహన్ యాదవ్‌ను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసే దిశగా ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకున్నారని ఏలూరు జిల్లా అనుబంధ కమిటీల ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొలుసు మోహన్‌యాదవ్ అన్నారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కార్యాలయంలో ఆయనను నియామకపు కమిటీలపై కలిసి, చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. ఎన్నికల ముందు ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేసి, హామీలు అమలు చేయకపోవడంతో అడుగడుగునా కూటమికి వ్యతిరేకత వస్తుందన్నారు. పార్టీ అధినేత ఇచ్చిన పిలుపులపై అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పోరాటాన్ని ఉధృతం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు అంకిత భావంతో కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మోహన్ యాదవ్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ పి.విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే అమృతం



పెదవేగి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



దెందులూరు: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెదవేగి: బిడ్డకు తల్లిపాలే అమృతమని విజయరాయి సెక్టార్ సూపర్‌వైజర్ కె.మేరీబాయమ్మ అన్నారు. మండలంలోని విజయరాయిలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సెక్టార్ సూపర్‌వైజర్ మేరీబాయమ్మ మాట్లాడుతూ తల్లులకు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ముర్రిపాలు పిల్లలకు మొదటి టీకా అని 6 నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలియజేశారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

దెందులూరు: బిడ్డకు తల్లిపాలు రక్షణ కవచమని ఐసీడీఎస్ దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ అన్నారు. బుధవారం దెందులూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. స్త్రీ శిశు సంక్షేమ వైద్య శాఖ సిబ్బంది సంయుక్తంగా తల్లిపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుభాషిని, అంగన్‌వాడీ కార్యకర్తలు రంగమ్మ, సుజాత, ధన, హైమావతి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు



సీతారామస్వామి వార్లు



స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుండుగొలనులోని శ్రీసీతారామస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు మూడో రోజైన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కొండ గంగ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా తిరుమల తిరుపతిలో జరిగే వార్షికోత్సవాల తరహాలో ఇక్కడ సీతారామస్వామి వార్లకు వార్షికోత్సవాలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తుంది. దివి నృసింహ గోపాలాచార్యులు, అర్చక జీవన తేజ, ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం సుధీరాచార్యులు, వైఖానసులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వార్లకు హోమాలు, కల్యాణమూర్తులకు స్నపన పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు పవిత్ర అలంకరణ చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి తీర్థ ప్రసాదాలను అందించారు.

నేడు గురుకులంలో స్పాట్ అడ్మిషన్

పెదవేగి: నేడు పెదవేగి ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఏఎస్ శివప్రసాద్ చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పెదవేగి గురుకులంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 14 సీట్లు, బైపీసీలో 8 సీట్లు, పదో తరగతిలో ఎస్సీ 5 సీట్లు, బీసీ–సీ 10 సీట్లు, ఎస్టీ 2 సీట్లు మిగిలాయన్నారు. మిగిలిన ఈ సీట్లకు పెదవేగి కళాశాలలో నేడు ఉదయం 10 గంటలకు స్పాట్ అడ్మిషన్ తీసుకుంటామని ఆసక్తి గల విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలకు రాగలరని ప్రిన్సిపాల్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: పెదవేగి నుంచి వెళ్లే రామసింగవరం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో నూతన లైన్ నిర్మించడానికి ఈ నెల 7వ తేదీ గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు మసింగవరం పరిధిలో వ్యవసాయ బోరు బావులకు తెల్లవారు జామున 4 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

తెలుగు మహాసభలకు షార్ట్ ఫిల్మ్ రూపకల్పన



షార్ట్ ఫిల్మ్‌లోని ఓ సన్నివేశాన్ని వివరిస్తున్న యువ డైరెక్టర్ తోట రవికుమార్

భీమడోలు: అమెరికాలో 2026 జనవరి 3న జరిగే తెలుగు మహా సభలకు అంతర్జాతీయ లఘుచిత్ర పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం గుండుగొలనులోని యువ కళాకారులు, పెద్దలు సంఘటితంగా తెలుగులో ఓ సందేశాత్మక కథనాన్ని రూపొందించారు. గుండుగొలనులో దివ్యాంగుల సేవా సమితి భవనంలో 20 నిమిషాల నిడివి గల తెలుగు లెస్స అనే ఓ షార్ట్ ఫిల్మ్ నిర్మించేందుకు షూటింగ్ ప్రారంభించారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు బంటు విజయకుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేసి, ప్రారంభించగా డాక్టర్ బి.కృష్ణ, చప్పిడి సత్యనారాయణ, తోట సత్యనారాయణ, గ్రామానికి చెందిన యువ డైరెక్టర్ తోట రవికుమార్ టీం వర్కు చేశారు. ఈ షార్ట్ ఫిల్మ్‌ను వీక్షించేందుకు విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

కార్మికుల జీవనం.. కడు దుర్భరం

- టైర్ పంచర్ దుకాణాల పెట్టుబడికి తప్పని తిప్పలు
- ప్రభుత్వ రుణాలు మంజూరు చేయాలని మొర



వంగూరు జాతీయ రహదారిపై లారీ టైరుకు పంచరు వేస్తున్న కార్మికుడు



దెందులూరు జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌కు గాలి పడుతున్న కార్మికుడు

పెదవేగి: బైక్ మీద ఊరుకి బయలు దేరుతాం. రయ్‌మని దూసుకు పోతాం. ఉన్నట్టుండి టైరు పంచర్ అయితే ఆ బాధ వర్ణనాతీతం. అక్కడికి కొద్ది దూరంలో పంచర్లు వేసే కార్మికులు కనిపిస్తే ప్రాణం లేచి వస్తుంది. పావు గంటలో పని ముగించుకొని మళ్లీ ప్రయాణం ప్రారంభిస్తాం. మరి అలాంటి ఆపద్బాంధవుల బతుకులు ఎలా ఉన్నాయో తెరిచి చూస్తే షాకవ్వాల్సిందే. గ్రామాలు, పట్టణాలతో పాటు జాతీయ రహదారుల పక్కన ఆపద్భాందవుల్లా కనిపించే పంచర్ వేసే వృత్తి వాళ్ల బతుకులు దుర్భరంగా మారాయి. నాటి సైకిళ్ల కాలం నుంచి నేటి బైకుల యుగం వరకు వీరి జీవన విధానంలో ఎలాంటి మార్పు చోటు చేసుకోలేదు. పంచర్ రేటు 50 పైసలు నుంచి ప్రారంభమై నేడు రూ.100 చేరుకున్నా తమ జీవితాలు అభివృద్ధికి నోచుకోవడం లేదంటూ 'సాక్షి' ముందు పలువురు పంచర్ దుకాణదారులు వాపోయారు.

గతంతో పోలిస్తే భారీగా పెరిగిన పెట్టుబడి

గతంలో పంచర్ దుకాణాలు పెట్టాలంటే పెద్దగా పెట్టుబడి అవసరం ఉండేది కాదని, నాడు ఉపాధి చూపిన సైకిళ్ల క్రమేపీ కనుమరుగు అవుతుండటంతో చాలా మంది సైకిళ్ల పంచర్ దుకాణదారులు రోడ్డున పడ్డారు. పెద్ద వాహనాలకు చెందిన పంచర్ దుకాణాలు పెట్టాలంటే కనీసం రూ. 60 వేలు వ్యయం అవసరం అవుతుందన్నారు. అందులో కంప్రెషరర్ రూ.23 వేలు, మిగతా మొత్తం పరికరాల కొనుగోలుకు వెచ్చించాల్సి వస్తుంది. సుదూ ర ప్రాంతాల నుంచి తమ కుటుంబాలను విడిచి పెట్టి బతుకుదెరువు కోసం జాతీయ రహదారుల పక్కన పంచర్ దుకాణాలు పెట్టి బతుకు పోరాటం సాగిస్తున్నామని అబ్దుల్ సమ్మద్, హాఫిజుల్లా, వెంకటేశ్వరరావు, నారాయణ, మురళీ, జక్కరయ్య తెలిపారు. దెందులూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సుమారు 223 మంది పంచర్ దుకాణదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. మైన్స్ తోలకాలు ఆగిపోవడంతో పనులు ఉండడం లేదని, జీవనం నరకయాతనగా మారిందని గొల్లుమన్నారు. ఈ వృత్తిలో ప్రధానంగా 90 శాతం ముస్లిం సోదరులే ఉన్నారని, ప్రభుత్వం పంచర్ దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి ఎటువంటి రుణ సాయం అందించడం లేదన్నారు. ది ఏలూరు టైర్ వర్క్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 78 మంది సభ్యులు ఉన్నారని, ప్రతి నెలా ఒక్కో షాప్ నుంచి రూ.60 చందా సేకరించి, అసోసియేషన్‌లో ఎవరి పరిస్థితి అయినా దుర్భరంగా ఉంటే వారికి దానం చేస్తున్నామని సభ్యులు చెబుతున్నారు. ఇలాంటి అధ్వాన పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రభుత్వం రుణాలు ఇప్పించి ఆదుకోవాలని పలువురు పంచర్ దుకాణ యజమానులు కోరుతున్నారు.

జీవితం దుర్భరంగా మారింది

గత 20 సంవత్సరాలుగా ఈ రహదారిపై పంచర్లు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. జీవితంలో ఎటువంటి ఎదుగు బదుగు లేకుండా, ఏ చిన్నపాటి అవసరం వచ్చినా అప్పులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ప్రభుత్వం మాలాంటి వారిని ఆదుకోవాలి.

–షేక్ అబ్దుల్ సమ్మద్, పంచర్ షాపు యజమాని, దెందులూరు

రుణాలిచ్చి ఆదుకోవాలి

వంగూరు జాతీయ రహదారిపై గత ఎనిమిది సంవత్సరాలుగా పంచర్లు వేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. నిత్యం ఏలూరు నుంచి వంగూరు జాతీయ రహదారిపై ఉన్న పంచర్ దుకాణం వద్దకు వచ్చి పనిచేసుకుంటాను. కొన్ని పనిముట్లు కావాలి. ఇప్పటికే కుటుంబ అవసరాల నిమిత్తం చాలా అప్పులు చేశాను. ప్రభుత్వం పంచర్ దుకాణ నిర్వాహకులకు ఋణాల పేరిట సాయం అందించాలి.

– ఎస్కే హాఫిజుల్లా, వంగూరు